# జగ్గతండాలో మహిళా సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన.



**బయ్యారం/,మే 25.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండలం జగ్గుతండా పంచాయతీలో మహిళా సంఘ భవన నిర్మాణానికి ముఖ్య అతిథిగా ఎంపిడిఓ దీపిక హాజరై సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణతో కలిసి సోమవారం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ప్రభుత్వం వెలుగుబాట వీవో సభ్యులకు భవనం నిర్మించుకోవడానికి రూ.10 లక్షలు మంజూరు చేసింది.కాగా సర్పంచ్,పాలకవర్గ సభ్యులు,ఐకేపీ సిబ్బందితో పాటు మహిళా సంఘ సభ్యులు భూమి పూజ చేశారు.మహిళా సంఘ సభ్యులు సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి భవన నిర్మాణం చేపట్టనున్నట్లు,మహిళలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా సర్పంచ్ బొల్లి జయంతి వెంకట కృష్ణ అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుంజా వీరస్వామి,పంచాయతీ కార్యదర్శి శ్రీహరి,వార్డు సభ్యులు వట్టం సావిత్రి, కంగ్రాతి యాకేష్,ఈసం పావని, బందారి స్వాతి, మక్కల దుర్గారావు, అంగీరేకుల లలిత, ధర్మాసోత్ కవిత, రాఘవేంద్ర,ఐకెపి సిబ్బంది,గ్రామ ప్రజలు పెద్దలు,మహిళా సంఘాల ఉద్యోగులు,గ్రామ మహిళలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంగీరేకుల సంజనకు విద్యా ప్రతిభా పురస్కారం...



**బయ్యారం/,మే 25.(జర్నలిస్ట్ వార్త)**

బయ్యారం మండల కేంద్రంలో విద్యా ప్రతిభా పురస్కారోత్సవాలు హాథి పథం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బయ్యారం మండలం జగ్గుతండ గ్రామానికి చెందిన అంగీరేకుల సంజన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 567 మార్కులతో అద్భుతమైన ప్రతిభ కనబరిచారు.ఈ సందర్భంగా హాథి పథం ఫౌండేషన్ తరపున సంజనను విద్యా ప్రతిభా పురస్కారంతోపాటు శాలువాతో ఘనంగా సన్మానించారు.వ్యవస్థాపక అధ్యక్షులు హాథిరాం నాయక్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులు అవ్వటానికి వారిని ప్రోత్సహించి ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుటకు వారిలో సామాజిక స్పృహ,శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకునేటట్లు అవగాహన కల్పించడం,యువతను డ్రగ్స్ మహమ్మారి బారిన పడకుండా అవగాహన కల్పిస్తూ వారిని పోటీ పరీక్షల వైపు మళ్ళించి మంచి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నమన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శాంతికిషన్, బొల్లి జయంతి,ఎస్ఐ ప్రశాంత్ బాబు,ఎంఈఓ లక్ష్మణ్ రావు,రవీందర్,తదితరులు పాల్గొన్నారు.

# రూ.50 వేల లంచం తీసుకుంటూ ఇరిగేషన్ డీఈ అరెస్ట్

## హనుమకొండలో ఏసీబీ దాడి

**హనుమకొండ, బ్యూరో మే 25 (జర్నలిస్ట్ వార్త) :**



అధికారిక పనులు పూర్తి చేయాలంటే లంచం తప్పదన్నట్లుగా వ్యవహరిస్తున్న అవినీతి అధికారులపై ఏసీబీ ఉక్కుపాదం మోపుతోంది. ఈ క్రమంలో హనుమకొండలో సోమవారం ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఇంజినీర్ ఏసీబీకి చిక్కాడు. జనగామ జిల్లా పాలకుర్తి ఇరిగేషన్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న డీఈ శ్రీకాంత్‌ను రూ.50 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

హనుమకొండ నగరంలోని భవానీనగర్‌లో ఉన్న తన నివాసంలో ఓ వ్యక్తి నుంచి అధికారిక పనుల నిమిత్తం లంచం స్వీకరిస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడి నిర్వహించారు. ముందస్తు సమాచారం మేరకు పక్కా ప్రణాళికతో వెళ్లిన అధికారులు డీఈ శ్రీకాంత్‌ను నగదుతో సహా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.ఈ ఘటనపై ఏసీబీ డీఎస్పీ పసునూరి సాంబయ్య మాట్లాడుతూ.. ఫిర్యాదు ఆధారంగా ట్రాప్ నిర్వహించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని తెలిపారు.

ఇటీవల కాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరుసగా అవినీతి అధికారులు ఏసీబీకి చిక్కుతున్నా.. ప్రభుత్వ శాఖల్లో లంచాల వ్యవహారం మాత్రం ఆగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణ ప్రజల పనులు సైతం డబ్బులు లేకుండా జరగని పరిస్థితి నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది.

# రేషన్ మాఫియా గుట్టురట్టు..!

## తల్లాడలో 100 బస్తాల బియ్యం పట్టివేత

## 'గుణ' కీలక సూత్రధారిగా అనుమానాలు

**తల్లాడ/, మే 25 (జర్నలిస్ట్ వార్త):**




పేదల కోసం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యంపై మాఫియా కన్నేసింది. తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతున్నప్పటికీ అక్రమార్కులు కొత్త మార్గాల్లో దందాను కొనసాగిస్తున్నారు. తల్లాడ మండల పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 100 బస్తాల రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకోవడం కలకలం రేపింది. ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కాజా రామారావు అలియాస్ 'గుణ' కీలక సూత్రధారిగా ఉన్నట్లు సమాచారం.

వివరాల్లోకి వెళితే.. కల్లూరు మండల పరిధిలోని రేషన్ డీలర్ దుకాణం నుంచి బియ్యాన్ని అక్రమంగా సేకరించి ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్నట్లు అధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన అధికారులు తల్లాడ మండలంలోని నారాయణబంజర గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ 39 టీవై 1851 నంబర్ గల ఎస్ఎంఎల్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 100 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.ప్రభుత్వం రేషన్ దందాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పేదల నోటికి వెళ్లాల్సిన బియ్యం మాఫియా చేతుల్లోకి వెళ్లడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని రేషన్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలని, ఇందులో ఉన్న అసలు సూత్రధారులను బయటపెట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కొనసాగించాలి

## జిల్లా కలెక్టర్‌ను కోరిన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు

### సానుకూలంగా స్పందించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

**హనుమకొండ, బ్యూరో మే25(జర్నలిస్ట్ వార్త)**



జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో గతంలో అమలులో ఉన్న విధంగానే ఈ విద్యా సంవత్సరంలో కూడా 50 శాతం ఫీజు రాయితీ కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా శాఖ నాయకులు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ను కోరారు.ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు సమర్పించిన వినతిపత్రంలో నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని పలువురు జర్నలిస్టుల పిల్లలు ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తోందని గుర్తుచేశారు.ప్రస్తుతం విద్యా ఖర్చులు గణనీయంగా పెరగడంతో జర్నలిస్టు కుటుంబాలు తీవ్ర ఆర్థిక భారం ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గతంలో అమలులో ఉన్న విధంగానే ఈ విద్యా సంవత్సరంలో కూడా జిల్లాలోని అన్ని ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కొనసాగించేలా సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ అంశంపై జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సానుకూలంగా స్పందించి జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ)ను అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, జిల్లా కార్యదర్శి ఊటుకూరు సాయిరాం, కోశాధికారి విష్ణువర్ధన్, ప్రెస్ క్లబ్ జనరల్ సెక్రటరీ బొల్లారం, కోశాధికారి అమర్, మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు కంకణాల సంతోష్, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎండ తీవ్రతపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## వృద్ధులు, చిన్నపిల్లలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

## ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు బిర్రు మహేందర్ మాదిగ పిలుపు

**వరంగల్/ మే 25 (జర్నలిస్ట్ వార్త):**



రాబోయే నాలుగు రోజుల పాటు జిల్లాలో ఉష్ణోగ్రతలు భారీగా పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలంతా ఎండ తీవ్రతపై అప్రమత్తంగా ఉండాలని దళిత రత్నా అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు బిర్రు మహేందర్ మాదిగ సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఒక ముఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల ఆరోగ్యంపై కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన కోరారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. తీవ్రమైన ఎండల కారణంగా వడదెబ్బ, డీహైడ్రేషన్ వంటి ప్రాణాంతక సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దాహం వేయకపోయినా సరే.. ప్రజలు తరచూ మంచి నీరు తాగాలని, దాంతో పాటు మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ వంటి ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.వేసవి కాలంలో పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే వారు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎండలో వెళ్లేటప్పుడు తప్పనిసరిగా తలకు గుడ్డ కట్టుకుని లేదా గొడుగుతో మాత్రమే బయటకు వెళ్లాలని స్పష్టం చేశారు. ఎండ వేళల్లో చిన్నపిల్లలను బయట ఆడనివ్వకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు వహించాలని కోరారు. ప్రజలు తమ ఆరోగ్య భద్రతపై ముందస్తుగా అప్రమత్తంగా ఉంటేనే వడదెబ్బ వంటి ముప్పుల నుంచి రక్షణ పొందవచ్చని బిర్రు మహేందర్ మాదిగ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే సస్పెన్షన్ తప్పదు

## తల్లాడ కాంగ్రెస్ ముఖ్య నాయకుల హెచ్చరిక

### రాగమయి, దయానంద్‌పై విమర్శలు సహించబోమని స్పష్టం





**తల్లాడ,/ మే 25 (జర్నలిస్ట్ వార్త):**

కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై అవాకులు చవాకులు పేల్చే వారిపై కఠిన చర్యలు తీసుకుని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని తల్లాడ మండల కాంగ్రెస్ ముఖ్య నాయకులు హెచ్చరించారు. మండల పరిధిలోని జీఎన్ఆర్ గార్డెన్స్‌లో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఈ మేరకు స్పష్టమైన ప్రకటన చేశారు.సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఇటీవల కొంతమంది నాయకులు సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. రాగమయి గానీ, దయానంద్ గానీ మండల నాయకులకు సమాచారం ఇవ్వకుండా ఎప్పుడూ పర్యటించలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడుతూ పనిచేస్తున్న కార్యకర్తలకే అధిష్టానం పదవులు కట్టబెట్టిందని పేర్కొన్నారు.

పదవుల కోసం ఆశించి, అవి రాకపోవడంతో కొంతమంది నాయకులు దయానంద్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇకపై ఎమ్మెల్యే రాగమయి లేదా రాష్ట్ర నాయకుడు దయానంద్‌పై ఎవరైనా అసభ్య వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఘాటుగా హెచ్చరించారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఒకరు ఇద్దరు పార్టీని వీడినా దయానంద్‌కు ఎలాంటి నష్టం లేదని, ఆయన వెంట లక్షలాది మంది కార్యకర్తలు ఉన్నారని వ్యాఖ్యానించారు.ఏ పదవిని ఎవరికి ఇవ్వాలన్నది ఎమ్మెల్యే రాగమయి నిర్ణయిస్తారని, అధిష్టానం సూచనల మేరకే అన్ని నిర్ణయాలు జరుగుతాయని తెలిపారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన కార్యకర్తలందరూ అధిష్టానం దృష్టిలో ఉన్నారని, ఎవరికి ఏ పదవి వచ్చినా అందరం కలిసికట్టుగా పనిచేస్తామని స్పష్టం చేశారు. సత్తుపల్లి నియోజకవర్గానికి రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్ సుప్రీమ్ నాయకుడని, ఆయనదే తుది నిర్ణయమని సభాముఖంగా ప్రకటించారు.

ఈ సమావేశంలో మల్లారం సర్పంచ్ కటికి కిరణ్, తెలగవరం సర్పంచ్ భూక్య కాలోజీ, బిల్లుపాడు సర్పంచ్ ఎన్నిక కృష్ణవేణి, కొత్త వెంకటగిరి సర్పంచ్ దీవెల వెంకటేశ్వరరావు, రామచంద్రపురం సర్పంచ్ రామారావు, పాత మిట్టపల్లి సర్పంచ్ పోట్రు సప్న, మంగాపురం సర్పంచ్ గోవిందు శ్రీనివాసరావు, గొడుగునూరి లక్ష్మారెడ్డి, గణేశుల రవి, దగ్గుల రఘుపతి రెడ్డి, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, దిరిశాల నరసింహారావు, వీరారెడ్డి, కోటిరెడ్డి, తుమ్మలపల్లి రమేష్, రాయల రాము, అడపా అనిల్, జక్కంపూడి కిషోర్, పైడిపల్లి రవి, మారెళ్ల మల్లికార్జున్, సత్యరెడ్డి, వారాల అజయ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు

# ఎండల వేళ చల్లని సేవ..!

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ -ప్రజల ఆరోగ్యమే లక్ష్యమన్న నాయకులు





**నర్సంపేట/, మే 25 (జర్నలిస్ట్ వార్త):** మండిపోతున్న ఎండల్లో ప్రజలకు ఉపశమనం కలిగించేలా నర్సంపేట పట్టణంలో కాంగ్రెస్ కార్యకర్తలు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నర్సంపేట నియోజకవర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పంబి వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో రోడ్డుపై ప్రయాణిస్తున్న ప్రజలకు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేసి దాహార్తి తీర్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయిలో నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న వేళల్లో బయటకు రావద్దని సూచించారు. తప్పనిసరిగా బయటకు రావాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, శరీరంలో నీటి శాతం తగ్గకుండా తరచూ నీరు, మజ్జిగ, జ్యూస్ వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచించారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఎండ తీవ్రతకు త్వరగా గురయ్యే అవకాశముండటంతో కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం దొంతి మాధవరెడ్డి మార్గదర్శకత్వంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యదర్శి చిప్ప నాగ, నర్సంపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొంత రంజిత్, కాంగ్రెస్ నాయకులు మెరుగు కిరణ్, మేడం కుమార్, భూక్య గణేష్, చీకటి శివమణి, షాలోమ్ సాగర్, హరీష్, యువజన నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గ్రామ దీపికలకు టీడీపీ అండ

## సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి డిమాండ్ -దీక్షా శిబిరంలో మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



**తల్లాడ,/ మే 25 (జర్నలిస్ట్ వార్త):** గ్రామీణ మహిళల అభివృద్ధికి కృషి చేస్తున్న గ్రామ దీపికల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గ్రామ దీపికల నిరవధిక నిరాహార దీక్షకు మద్దతుగా సోమవారం తల్లాడ పట్టణంలో టీడీపీ మండల నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొంటున్న గ్రామ దీపికలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న గ్రామ దీపికల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. అతి తక్కువ వేతనాలతో పనిచేయిస్తూ వారి శ్రమను దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది గ్రామ దీపికలు తమ సమస్యల పరిష్కారం కోసం నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు.పెరుగుతున్న ధరలకు అనుగుణంగా గ్రామ దీపికల వేతనాలు పెంచాలని, ఆరోగ్య భద్రత కోసం హెల్త్ పాలసీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీనియారిటీ ఆధారంగా సీనియర్ గ్రామ దీపికలను సీసీలుగా గుర్తించాలని, హెచ్ఆర్‌సీ పాలసీ అమలు చేయాలని కోరారు. గౌరవ వేతనం కాకుండా కనీసం రూ.20 వేల వేతనం మంజూరు చేసి గ్రామ దీపికలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గ్రామ దీపికల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు వారి ఉద్యమానికి తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మొక్క కృష్ణార్జునరావు, ధూపాటి భద్రరాజు, బిల్లుపాడు గ్రామ శాఖ అధ్యక్షుడు నారపోగు ప్రసాద్‌బాబు, గొల్లగూడెం గ్రామ శాఖ అధ్యక్షుడు చల్లా నాగయ్య, గ్రామ దీపికల మండల అధ్యక్షురాలు డి.సుజాత, ప్రధాన కార్యదర్శి సీహెచ్ జయలక్ష్మి, కోశాధికారి సీహెచ్ కళావతి, ఉపాధ్యక్షురాలు కే.విజయలక్ష్మి, సహాయ కార్యదర్శి ఎన్.అనసూయ, పి.నాగ ప్రసన్న, కె.వెంకటకృష్ణమ్మ, ఆమని జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఐనవోలులో ఘనంగా ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

## విజేతలకు బహుమతులు అందజేసిన మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



**ఐనవోలు/మే 25(జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలో గత కొన్ని రోజులుగా ఉత్సాహభరితంగా సాగిన క్రికెట్ క్రీడోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు నిర్వహించిన ఈ టోర్నమెంట్ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విజేత జట్లకు నగదు బహుమతులను అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. టోర్నీలో ప్రతిభ చాటి ప్రథమ స్థానంలో నిలిచిన విన్నర్స్ జట్టుకు రూ.25,000, ద్వితీయ స్థానంలో నిలిచిన రన్నర్స్ జట్టుకు రూ.10,000తో పాటు ప్రతిభ కనబరిచిన మరో జట్టుకు రూ.5,000 ప్రోత్సాహక బహుమతిని ఆయన చేతుల మీదుగా ప్రదానం చేశారు.ఈ సందర్భంగా మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ.. యువతలో



క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. గతంలో ఐనవోలు ప్రాంతానికి చెందిన మల్లికార్జున టీమ్ క్రీడారంగంలో సాధించిన ప్రత్యేక గుర్తింపును, అప్పట్లో యువ క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా గ్రామంలో వెల్లివిరిసిన క్రీడా చైతన్యాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ నేటి తరం యువత కూడా క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగడం అభినందనీయమన్నారు. క్రీడలు కేవలం వినోదానికే పరిమితం కాకుండా యువతలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆరోగ్యకరమైన పోటీ తత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. నేటి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, క్రీడలను తమ జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి, క్రీడా కోటా ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, క్రీడాకారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎండ తీవ్రతపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## వృద్ధులు, చిన్నపిల్లలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

## తల్లాడ మండల టీసీసీ అధ్యక్షుడు బ్రదర్ ఇశ్రాయేలు సూచనలు



**తల్లాడ/, మే 25 (జర్నలిస్ట్ వార్త):** రాబోయే నాలుగు రోజుల పాటు జిల్లాలో ఉష్ణోగ్రతలు భారీగా పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తల్లాడ మండల టీసీసీ అధ్యక్షుడు బ్రదర్ ఇశ్రాయేలు సూచించారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించారు. ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బ, డీహైడ్రేషన్ వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దాహం లేకపోయినా తరచూ నీరు తాగాలని, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ వంటి ద్రవ పదార్థాలను తీసుకోవాలని సూచించారు.వేసవి కాలంలో రైతులు, కూలీలు, బయట పనిచేసే వారు తగిన జాగ్రత్తలు పాటించాలని, తలకు గుడ్డ కట్టుకుని మాత్రమే బయటకు వెళ్లాలని తెలిపారు. ఎండ వేళల్లో చిన్నపిల్లలను బయట ఆడనివ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు.ప్రజలు ఆరోగ్య భద్రతపై అప్రమత్తంగా ఉంటేనే వడదెబ్బ వంటి ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చని బ్రదర్ ఇశ్రాయేలు పేర్కొన్నారు.

# పంట కొయ్యలు కాల్చొద్దు..!

## ఈత, తాటి వనాలకు ముప్పు

## రైతులకు కాంగ్రెస్ నేత ఇంద్రసేనారెడ్డి హెచ్చరిక



**ఎల్కతుర్తి/మే 25(, జర్నలిస్ట్ వార్త:)** వరి, మక్క పంటల కొయ్యలను తగులబెట్టడం వల్ల భూమి సారవంతత దెబ్బతినడంతో పాటు ఈత, తాటి వనాలు అగ్నికి ఆహుతవుతున్నాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు పంట అవశేషాలను కాల్చకుండా వ్యవసాయ నిపుణుల సూచనలు పాటించాలని కోరారు.పంటల అవశేషాలను కాల్చడం వల్ల భూమిలో ఉండే సూక్ష్మజీవులు నశించి నేలలో తేమ తగ్గిపోతుందని, దీని ప్రభావం దిగుబడులపై పడుతుందని తెలిపారు. వ్యర్థాలను భూమిలో కలిపి కంపోస్ట్, మల్చింగ్ విధానాల్లో వినియోగిస్తే భూమి సారవంతత పెరగడంతో పాటు రసాయన ఎరువుల భారం తగ్గుతుందని చెప్పారు.ఇటీవల ఆరేపల్లి, కమలాపూర్, గోపాల్‌పూర్, దామెర తదితర గ్రామాల్లో వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో మోటార్ పైపులు, టేకు వనాలు, ఈత, తాటి చెట్లు దగ్ధమైన ఘటనలు చోటుచేసుకున్నాయని గుర్తుచేశారు. వ్యవసాయ శాఖ అధికారులు, కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి పంట అవశేషాలను కాల్చవద్దని హెచ్చరించినప్పటికీ కొందరు రైతులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.పంట వ్యర్థాలను కాల్చడం వల్ల కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్ వంటి ప్రమాదకర వాయువులు వెలువడి గాలి కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారని తెలిపారు. రైతులు పంటల మార్పిడి విధానాలు పాటిస్తూ అవశేషాలను సేంద్రియ ఎరువులుగా మార్చుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు.వ్యవసాయ భూములను, ప్రకృతి వనరులను కాపాడుకోవడం ప్రతి రైతు బాధ్యత అని, ఈత, తాటి వనాలను సంరక్షించేందుకు అందరూ ముందుకు రావాలని ఇంద్రసేనారెడ్డి పిలుపునిచ్చారు.

# మండుటెండల్లో చల్లని చలివేంద్రం..!

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

## ప్రజలు జాగ్రత్తగా ఉండాలని నాయకుల సూచన



**నర్సంపేట,/ మే 25 (జర్నలిస్ట్ వార్త):** ఎండలు మండిపోతున్న వేళ ప్రజలకు ఉపశమనం కలిగించేలా కాంగ్రెస్ నాయకులు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నర్సంపేట నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పంబి వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ఆదివారం మజ్జిగ పంపిణీ చేపట్టారు.పట్టణంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో దాహార్తితో వెళ్తున్న ప్రజలకు మజ్జిగ అందజేసి దాహం తీర్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితులు తప్ప ప్రజలు మధ్యాహ్న వేళల్లో బయటకు రావద్దని సూచించారు. బయటకు రావాల్సి వస్తే తలకు గుడ్డ కట్టుకోవడం, తరచూ నీరు, మజ్జిగ, జ్యూస్ వంటి ద్రవ పదార్థాలు తీసుకోవడం తప్పనిసరి అన్నారు.చిన్నపిల్లలు, వృద్ధులు ఎండ తీవ్రతకు ఎక్కువగా గురయ్యే అవకాశం ఉన్నందున కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం దొంతి మాధవరెడ్డి మార్గదర్శకత్వంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి చిప్ప నాగ, నర్సంపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొంత రంజిత్, కాంగ్రెస్ నాయకులు మెరుగు కిరణ్, మేడం కుమార్, భూక్య గణేష్, చీకటి శివమణి, షాలోమ్ సాగర్, హరీష్, యువజన నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెట్రో ధరల పెంపు ఎవరి కోసం

## కేంద్రం తీరుపై మండిపడ్డ మల్లికార్జున ఖర్గే

**న్యూఢిల్లీ, మే 25(జర్నలిస్ట్ వార్త):** శంలో రోజురోజుకు పెరుగుతోన్న ఇంధన ధరల పై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆందోళన వ్యక్తంచేశారు. ఈ రోజూవారీ దోపిడీ వల్ల ఎవరు లాభపడుతున్నారని ప్రశ్నించారు. సామాన్యుల పొదుపును తగలబెట్టడానికి మోదీ ప్రభుత్వం పెట్రోల్ చల్లుతోందని విమర్శించారు. 2014లో రూ.71.41 ఉన్న లీటర్ పెట్రోల్ ధరను మోదీ సర్కారు 2026 నాటికి రూ.102.12కు చేర్చిందని ఎద్దేవా చేశారు. రెండు వారాల లోపే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం ఇది నాలుగోసారి అని.. ఈ రోజువారీ ఇంధన దోపిడీ ఇంకా ముగిసిపోలేదన్నారు.

